అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడు

- ఉత్కంఠకు తెర
- సాయంత్రానికి తేలనున్న ఫలితాలు
- పకడ్బందీగా ఓట్ల లెక్కింపునకు అధికారుల చర్యలు


పాడేరులో కౌంటింగ్ కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సాక్షి పాడేరు/అనంతగిరి: అల్లూరి జిల్లాలోని అరకు, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఫలితాలు మంగళశారం విడుదలవుతుండడంతో ఉత్కంఠానికి తెరపడనుంది. ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ సీటు పరిధిలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటు చేయడం జరిగింది. పాడేరు కేంద్రంగా రెండేళ్ల క్రితం కొత్త జిల్లాను ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా జిల్లాలో అరకు, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీలుగా అరకు పార్లమెంట్‌గా ఎన్నిక జరిగింది. అరకు, పాడేరు నియోజవర్గాల్లో 11 మండలాలు, రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో ఉన్నాయి. అల్లూరి జిల్లా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గ ప్రజలు సర్వత్రా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. కొన్ని గంటల్లోనే ఈ ఉత్కంఠకు తెరపడనుంది. మే 13న నియోజకవర్గ ఓటర్లు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల భవిష్యత్‌ను ఈవీఎంలలో ఓటు ద్వారా తెలియజేశారు. 22 రోజుల తరువాత ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల భవితవ్యంపై ఉత్కంఠకు కొన్ని గంటల్లో తెరపడనున్నది. ఈసారి ఎన్నికల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని రాత్రి 8 గంటల వరకూ ఓటర్లు వారి వారి ఓట్లను వినియోగించుకున్నారు. గతంతో పోలిస్తే ఓటర్లతో చైతన్యం రావడంతో ఓటుహక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలు వద్ద బారులుతీరారు. ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరికి వారు తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అరకు, పాడేరు నియోజకవర్గాలకు సంబంధించి పాడేరు డిగ్రీ కళాశాల కేంద్రంగా, రంపచోడవరంలోని జూనియర్ కళాశాల కేంద్రంగా మంగళవారం ఉదయం 8 గంటలకు ఎన్నికల కౌంటింగ్ జరుగుతుంది. సాయంత్రం నాటికి గెలిచే అభ్యర్థుల వివరాలు తెలియవచ్చని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు.

పోలింగ్ కేంద్రాలు,రౌండ్లు వివరాలు...

అరకు నియోజకవర్గం: పోలింగ్ కేంద్రాలు–304, 22 రౌండ్లు లెక్కింపు ఉంటుంది.


కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

పాడేరు నియోజకవర్గం: పోలింగ్ కేంద్రాలు– 318, 23 రౌండ్లు లెక్కింపు ఉంటుంది.

రంపచోడవరం నియోజకవర్గం: పోలింగ్ కేంద్రాలు– 399, 20 రౌండ్లు లెక్కింపు ఉంటుంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


చింతపల్లి సీఐ రమేష్


హుకుంపేట ఎస్ఐ సతీష్

చింతపల్లిరూరల్: కలెక్టర్ విజయ సునీత ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల ఫలితాల లెక్కింపు కారణంగా పాడేరులో సెక్షన్ 144 అమలులో ఉందని సీఐ రమేష్ తెలిపారు. ఈ మేరకు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజలు పాడేరు వెళ్లేందుకు అనుమతి లేదన్నారు.ఏజెంట్లు, పాత్రికేయులు ప్రభుత్వం మంజూరు చేసిన పాసులు ఉంటేనే పాడేరు వెళ్లేందుకు అనుమతి ఉందని, ఇతరులు ఎవరైనా అనుమతులు లేకుండా వెళ్లేందుకు ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యాలు చేయడం, బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం వంటివి చేయవద్దని ఆయన సూచించారు.

ముంచంగిపుట్టు: ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రవీంద్ర చెప్పారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని, పాడేరు జిల్లా కేంద్రానికి ఎవరూ వెళ్లకూడదన్నారు. ర్యాలీలు, ఊరేగింపులు నిషేధమని, ప్రజలు గుంపులు గుంపులు గా ఉండకూడదని, అందరూ ఇళ్లల్లో ఉండాలని, ముఖ్యంగా సోషల్ మీడియాలో సైతం రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం వంటివి చట్టరీత్యా నేరమని, అందరూ పోలీసులకు సహకారించాలని ఆయన కోరారు.

హుకుంపేట: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓట్లు లెక్కింపులు నేపథ్యంలో గ్రామల్లో వివిధ పార్టీల శ్రేణులు, కార్యకర్తలు,గిరిజనులు అల్లర్లకు, గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సతీష్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎటువంటి ర్యాలీలు చేయవద్దన్నారు.

గంగవరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉందని ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. ఈ సందర్భంగా ర్యాలీలు, బాణసంచా కాల్చడం వంటిని చేయవద్దని, జనం గుంపులుగా ఉండవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి వారపు సంత రద్దు

జి.మాడుగుల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మంగళవారం కానున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మండలంలో సంతబయలు గ్రామంలో వారపుసంతను రద్దు చేస్తున్నట్టు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో అరకు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144సెక్షన్ అమల్లో ఉందన్నారు. జి.మాడుగుల మండలం, సంతబయలు గ్రామంలో జరిగే వారపు సంతను ఎలక్షన్ కౌంటింగ్ నేపథ్యంలో రద్దు చేసినట్టు తెలిపారు. వారపు సంతకు వచ్చే వ్యాపారులు, రైతులు చిల్లర వర్తకులు, దుకాణదారులు, ప్రజలు గమనించాలని ఆయన తెలిపారు. గ్రామాల నుంచి పాడేరుకు జనాలను తరలించడం. నిషేధిత ప్రాంతాల్లో తిరగడం, గుంపులుగా ఉండటం సమావేశాలు నిర్వహించడం, విజయోత్సవాలు, బాణసంచా పేల్చడం చేయకూడదన్నారు. ఎలక్షన్ కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పోలీస్‌లకు ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


పాల్గొన్న విద్యార్థులు

అరకులోయ రూరల్: మండలంలో విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసేందుకు గిరిబాల నేస్తం, క్లబ్, ఆసరా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిబాల నేస్తం జిల్లా కన్వీనర్ వి.వి.జయ మాట్లాడుతూ మండలంలో చొంపి, బొండం, సుంకరమెట్ట, పెదలబుడు పంచాయతీల పరిధిలో ఉన్న సుమారు 8 గ్రామాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో స్కిప్పింగ్, చెస్, బ్యాడ్మింటన్ తదితర ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. నాగేంద్ర, సీతారాం, సంధ్య, దేవారాజ్, మనోహర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

77 మందికి వైద్య పరీక్షలు


అమ్మిరేఖలలో వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి సుష్మ, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని కిమ్మిలిగెడ్డ, అమ్మిరేఖల గ్రామాల్లో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులను గుర్తించేందుకు రక్త పరీక్షలు చేశారు. శిబిరంలో 77 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు వైద్యాధికారి సుష్మ చెప్పారు. గర్భిణులు, బాలింతలు, సుగర్, బీపీ సమస్యలు ఉన్న వారికి ప్రత్యేక వైద్యం అందించి, సూచనలు, సలహాలు ఇచ్చినట్టు తెలిపారు. హెచ్‌వీ రమాబాయి, ఎంఎల్‌హెచ్‌పీ సంపత్, లక్ష్మయ్య, 104 డీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కిషోర్

మారేడుమిల్లి : ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వీరా కిషోర్ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సార్ల లలిత కమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సంద్బంగా మారేడుమిల్లి గ్రామంలో డ్రైనేజీ, రోడ్లు వ్యవస్థ అధ్వానంగా ఉందని, మురుగు నీరు నిల్వ ఉండి, దోమలు పెరుకుపోయి ప్రజలు రోగాలు బారిన పడుతున్నారని, రోడ్డుకు ఇరువైపులా అక్రమ కట్టడాలు పెరిగిపోయాయని సర్పంచ్ కొండా జాకబ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వాలమూరు గ్రామంలో పాఠశాల భవనాన్ని ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకుని గెస్ట్ హౌస్‌ల వినియోగిస్తున్నారని, దానిని తిరిగి గ్రామస్తులకు అప్పగించాలని జీఎం వలస సర్పంచ్ కారం లక్ష్మి కోరారు. అదే విధంగా పలు పంచాయతీల నుంచి వారి గ్రామాల సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారులకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో వీరా కిషోర్ మాట్లాడుతూ ఆయా సమస్యలను సకాలంలో పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీటీసీ సభ్యు డు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, మండల కో–ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణ, సీడీపీవో ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

చింతపల్లిరూరల్: గూడెంకొత్తవీధి మండలం జెర్రిల పీహెచ్‌సీ వైద్యులను సస్పెండ్ చేయాలని సోమవారం గిరిజనులు అందోళన చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని దీంతో సకాలంలో వైద్య సేవలందడం లేదని చెప్పారు. పీహెచ్‌సీకి అంబులేన్స్ సాకర్యం కల్పించాలని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్‌కు లేఖ రాస్తున్నట్టు వారు తెలిపారు. తక్షణమే అధికారులు చొరవ తీసుకోని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రగతికి మారుపేరు.. లోతేరు


లోతేరులో నిర్మించిన గ్రామ సచివాలయం


లోతేరులో ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం


ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గార్డెన్


లోతేరులో తాగునీటి పథకం

- రూ.6.34 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు
- అందుబాటులో వచ్చిన సెల్ సేవలు
- దశాబ్దాల సమస్యలకు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న పంచాయితీ గిరి ప్రజలు


లోతేరులో రైతు భరోసా కేంద్రం


లోతేరు గ్రామంలో సీసీ రోడ్డు

అరకులోయ రూరల్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అరకు నియోజకవర్గంలోని ఒక్క ప్రాంతంలోనూ అభివృద్ధి జరగలేదు. గ్రామాల్లో సమస్యలు తాండవిస్తూ ఉండేవి.. తాగునీటి కోసం గిరిజనులు అల్లాడిపోయేవారు...చిత్తడి రహదారులతో నానా అవస్థలు పడ్డారు. రవాణా సౌకర్యం లేక కాలినడకనే రాకపోకలు సాగించేవారు.. చంద్రబాబు ప్రభుత్వం ఏ గ్రామంలోనూ కనీస సౌకర్యాలు కల్పించలేదు. ఏళ్ల తరబడి గిరిజనులు సమస్యలతో సతమతమయ్యేవారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏజెన్సీలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మన్య ప్రాంతంలోని శివారు గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. ఫలితంగా నేడు గిరిజన గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయి. దశాబ్దాల సమస్యలు పరిష్కారం కావడంతో గిరిజనులు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ప్రతి గడపకు సంక్షేమం

మండలంలోని లోతేరు పంచాయతీ అభివృద్ధి బాటలో ముందడుగు వేసింది. పంచాయతీ పరిధిలో ఉన్న 13 గ్రామాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ తదితర సదుపాయాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమకూర్చింది. పంచాయతీ పరిధిలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. లోతేరు పంచాయితీ కేంద్రంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించింది. ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సేవలను అందిస్తోంది.

వైద్య రంగానికి మరింత ప్రోత్సాహం

గతంలో ఏనాడు లేని విధంగా వైద్య రంగానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తోంది. అన్ని వర్గల ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంది. గతంలో చిన్న పాటి వైద్యానికి కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి వెళ్లేవారు.. ఇప్పుడు గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల ఏర్పాటుతో ఇంటింటికీ వైద్య సేవలు అందుతున్నాయి. లోతేరు పంచాయతీలో రూ.20లక్షలతో ఆరోగ్య ఉప కేంద్రాన్ని నిర్మించారు. గిరిజనులకు ఎంతో ఉపయోగపడుతుంది.


లోతేరులో సెల్ టవర్

విద్యా ప్రమాణాలకు సముచిత స్థానం

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. నాడు–నేడు ద్వారా కోట్లాది రూపాయల నిధులు మంజూరుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. ఇందులో భాగంగా లోతేరులో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలకు రూ.20లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించారు. ఉన్నత స్థాయి ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతుంది. దీంతో ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ఏళ్ల సమస్యలకు పరిష్కారం



గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న సమస్యలు వైఎస్సార్‌సీపీ పాలనలో పరిష్కారమయ్యాయి. గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. జగనన్న ప్రభుత్వ పాలనలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– టి.రవి, వ్యాపారి, కిక్కిట్టిగుడ గ్రామం, లోతేరు పంచాయతీ

జగనన్నకు రుణపడి ఉంటాం



ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఎన్నడూ లేనంత అభివృద్ధి గిరిజన గ్రామాల్లో జరిగింది. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కింది. మాలాంటి గిరిజనుల జీవితాలను మార్చిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– పి రాము, లోతేరు

అభివృద్ధి పనులివీ...

- పంచాయతీ పరిధిలో 27 గ్రామలకు రూ.15 లక్షల వ్యాయంతో ఇంటింటికీ తాగునీటి సదుపాయం కల్పించారు.
- రూ.10లక్షలతో కురిసేల గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు.
- కిక్కిటిగుడ నుంచి గానుకవల వరకు రూ.16లక్షలతో తారురోడ్డు నిర్మాణం జరిగింది.
- కాగువలస నుంచి అంటిపార్తి వరకు రూ.1.80లక్షలతో రహదారి పనులు జరుగుతున్నాయి.
- దనసానివలసలో రూ.28లక్షలతో, తోడుబంధలో రూ.40లక్షలతో ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు.
- రూ.50లక్షలతో తోడుబంధ, కిక్కిట్టిగుడ, కురిసేల గ్రామల్లో బోర్లు నిర్మించారు.
- దుంబ్రిగుడలో రూ.8లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు.
- రూ.73లక్షలతో తోడుబంద నుంచి దడడద వలస వరకు గ్రావెల్ రోడ్డు, వంతలగూడ నుంచి లిడంగి వరకు రూ.15లక్షలతో గ్రావెల్ రోడ్డును నిర్మించారు.


నాడు–నేడులో అభివృద్ధి చెందిన పాఠశాల భవనం

చెరకుంపాలెంలో చెక్‌పోస్టు ఏర్పాటు


చెరకుంపాలెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రఘునాథరావు తదితరులు

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం జంక్షన్ వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్టు సీఐ సన్యాసి నాయుడు సోమవారం విలేకరులకు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా మండలవ్యాప్తంగా పలు చర్యలు చేపట్టామని సీఐ అన్నారు. ఇందులో భాగంగా చెరకుంపాలెంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ఆ మార్గంలో వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. రంపచోడవరం కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే వారి వద్ద తగిన పాసులు ఉండాలన్నారు. పాస్‌లు లేకుండా రంపచోడవరం వెళ్లేందుకు అనుమతించేదిలేదన్నారు. ఎస్ఐ రఘునాథ రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులను గుర్తించాలి


భవిత రిసోర్స్ పర్సన్ హరిత, సిబ్బందికి సూచనలిస్తున్న సీడీపీవో దేవమణి

రాజవొమ్మంగి: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వినికిడి లోపం, మానసిక అనారోగ్యం, తలసేమియా, సికిల్‌సెల్ తదితర సమస్యలతో ఉన్న ప్రత్యేక అవసరాల చిన్నారులను గుర్తించి నివేదిక ఇవ్వాలని స్థానిక సీడీపీవో దేవమణి సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో 0 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. అటువంటి పిల్లలకు భవిత ప్రోగ్రాం ద్వారా ప్రభుత్వం పూర్తి సహాయ సహకారం అందిస్తుందన్నారు. స్థానిక భవిత రిసోర్స్ పర్సన్ హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

చింతపల్లిరూరల్: మండలంలోని అంతర్ల గ్రామంలో ఇంటిపై ఆదివారం రాత్రి సుమారు 2 గంటల సమయంలో పిడుగు పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన సందర్భంగా ఇంట్లో వాళ్లు తీవ్ర భయందోళనకు గురయ్యారు. పిడుగు పడడంతో ఇంటిలో ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్, విద్యుత్ బోర్డు పూర్తిగా ధ్వంసమైనట్టు ఇంటి యజమాని కోరాబు మోహన్‌రావు తెలిపారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపిల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఘటాల ఊరేగింపు


ఘటాల ఊరేగింపులో చిన్నారులు

అడ్డతీగల: మండల వాసులు ఇలవేల్పు సోమాలమ్మ అమ్మవారి ప్రతిరూపం గ్రామసంచారం జరుగుతుంది. జాతరకు వారం రోజులు ముందుగా సీతారామరాజు కాలనీ వాసులు అమ్మవారిని తమ కాలనీలో కొలువుంచుకుంటారు. ఇందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపాన కొలువైన సోమాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ఘటాన్ని అమ్మవారి పాదాల చెంత ఉంచి పూజలు సోమవారం నిర్వహించారు. అనంతరం బాలిక నెత్తిన ఆ ఘటాన్ని ఉంచి డప్పు వాయుద్యాల నడుమ గ్రామమంతా ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లినప్పుడు సాక్షాత్తు తమ ఇలవేల్పుగా కొలుచుకునే సోమాలమ్మ అమ్మవారు తమ ముంగిటకు వచ్చినట్టు భావించిన మహిళలు పసుపు, కుంకుమ, బియ్యం, నగదు సమర్పిస్తారు. ఇలా జాతర నిర్వహించే సమయం సమీపించే వరకూ గ్రామంలోని ప్రతి ఇంట సంచరిస్తారు. అలా భక్తుల నుంచి సేకరించిన బియ్యం తమ కాలనీకి చేర్చి జాతర సమయంలో అన్నదానం నిర్వహించుకుంటారు.

పింఛన్ కోసం తప్పని అవస్థలు


పెదబయలు గ్రామీణ బ్యాంకు వద్ద పింఛన్ కోసం క్యూలో ఉన్న పింఛన్‌దారులు

పెదబయలు: మండలంలోని పింఛన్ డబ్బులు కోసం వృద్ధులు, వితంతువులు బ్యాంకుల వద్ద అవస్థలు పడుతున్నారు. మూడో రోజు సోమవారం బ్యాంకుల ఎదుట పింఛన్‌దారులు క్యూ కట్టారు. మండలంలోని గ్రామీణ వికాస్ బ్యాంకు, స్టేట్ బ్యాంకులు పింఛన్‌దారులతో నిండిపోయాయి. బ్యాంకులతో పాటుగా బ్యాంకు సర్వీసు సెంటర్ల వద్ద పింఛన్‌దారులు అవస్థలు పడ్డారు. గతంలో పింఛన్ సొమ్మును గ్రామ వలంటీర్లు ఇంటికి వచ్చి ఒకటో తేదికి వచ్చి ఇచ్చేవారని కొంత మంది స్వార్థం కారణంగా ఇబ్బందులు పడుతున్నామని మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే మా కష్టాలు తీరుతాయని పలువురు పింఛన్‌దారులు చెప్పారు.